# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | సోమవారం-05- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 218 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఆర్టీసీ బస్సులో ప్రసాద్ ల్యాబ్‌స్‌కు వెళ్లి 'పూలే' చిత్రం వీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)

సోమవారం రోజు శాసనసభ సమావేశాలు ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రసాద్ ల్యాబ్‌స్‌కు వెళ్లి సందేశాత్మక చిత్రంగా రూపొందిన 'పూలే' సినిమాను వీక్షించారు.

సామాజిక సంస్కరణలు, సమానత్వం, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలను ప్రతిబింబించే ఈ చిత్రం ప్రతి ఒక్కరికి ఆలోచన రేకెత్తించే విధంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రజలకు చేరువగా ఉండాలనే ఉద్దేశంతో ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీ బస్సులోనే సినిమా వీక్షణకు వెళ్లడం ద్వారా నాయకులు ఒక మంచి సందేశాన్ని అందించారని పలువురు ప్రశంసించారు. 'పూలే' చిత్రం సమాజంలో మార్పు తీసుకురావడానికి దోహదపడే అంశాలతో రూపొందిందని, ఇలాంటి చిత్రాలు యువతకు ప్రేరణనిస్తాయని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.





## చేనేత కార్మికులకు రూ.27.14 కోట్ల రుణ మాఫీ

### మంత్రి తుమ్మల

రాష్ట్రంలో 2017 నుంచి 2023 వరకు 6,784 మంది చేనేత కార్మికులకు రూ.లక్షలోపు రుణ మాఫీ కోసం రూ.27.14 కోట్లు మంజూరు చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చేనేత భరోసా, పొదుపు పథకం కింద రూ.303 కోట్లు, పావలా వడ్డీ కింద రూ.109 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, నెల్లికంటి సత్యం తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నాగేశ్వరరావు సమాధానమిస్తూ.. టెస్కో ద్వారా చేనేత కార్మికుల నుంచి రూ.587 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు.

## పోలవరం–నల్లమల సాగర్‌పై స్టే కోరనున్న తెలంగాణ

- పోలవరం–నల్లమల సాగర్ లింక్‌పై సుప్రీంలో సూట్ పిటిషన్
- 12న కేసు విచారణ... స్వయంగా హాజరవుతా: ఉత్తమ్
- రిట్‌ను సూట్‌గా మార్చాలని సూచించిన సుప్రీంకోర్టు
- రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు న్యాయవాదులతో భేటీ
- ప్రాజెక్టుకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక వ్యతిరేకం
- సీడబ్ల్యూసీ లేఖ ఆమోదం కాదని స్పష్టం
- ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు
- తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌కు రూ.10 కోట్లు మంజూరు
- అవసరమైన చోట్ల కొత్త రేషన్ షాపులు మంజూరు చేస్తాం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణంపై స్టే ఇవ్వాలంటూ 12న రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టులో సూట్ దాఖలు చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సూట్ పిటిషన్‌గా మార్చి సమర్పించాలని సూచించిన కోర్టు.. కేసును 12వ తేదీకి వాయిదా వేసిందని గుర్తు చేశారు.

మిగతా 2లో



## బీఆర్ఎస్‌కు నైతికత లేదు

### ఉద్యమంలో కీలక పాత్ర.. కానీ తెలంగాణ తర్వాత ఆంక్షలు

- కక్ష, కుట్రతోనే పార్టీ నుంచి బయటకు పంపించారు
- ఉద్యమకారులకు బీఆర్ఎస్‌లో గౌరవం లేకపోయింది
- అమరవీరుల స్మారకాలు, విగ్రహాల నిర్మాణంలో అవినీతి ఆరోపణలు
- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా ఆమోదించాలని మండలిలో ప్రసంగం
- ఆస్తుల పంచాయితీ కాదు... ఆత్మగౌరవ పోరాటమే
- తెలంగాణ ఉద్యమంలో ఢిల్లీ స్థాయిలో చేసిన ప్రయత్నాలు
- టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించా
- పదేళ్ల పాలనలో ప్రజల ఆశలు అడియాసలు అయ్యాయి
- పార్టీ సస్పెన్షన్ న్యాయపరంగా సవాల్ చేయను
- కొత్త రాజకీయ శక్తిగా మళ్లీ వస్తా: కవిత ప్రకటన



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

'బీఆర్ఎస్‌కు నైతికత లేదు. ఉద్యమ సమయంలో సొంతంగా అనేక కార్యక్రమాలు నిర్వహించాను. యువతను, మహిళలను ఆకర్షించాను. ఎన్నో పోరాటాలు చేశా. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో మొదటి బతుకమ్మ ఉత్సవాల నుంచే నాపై ఆంక్షలు మొదలయ్యాయి. నాపై కక్ష కట్టి.. కుట్ర చేసి బయటకు పంపారు. అవమాన భారంతో అన్ని బంధాలు, బంధనాలు తెంచుకుని ఇంటి పార్టీ నుంచి బయటకు వచ్చాను. ఆ పార్టీ నుంచి బయటకు రావడం సంతోషంగా ఉంది'' అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు.

ప్రశ్నించడాన్ని నేర్పిన బీఆర్ఎస్ పార్టీయే తాను ప్రశ్నిస్తే కక్షగట్టిందని, కక్ష గట్టి.. కుట్ర చేసి పార్టీ నుంచి బయటకు పంపిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ వచ్చాక మంచి జరుగుతుందని ప్రజలకు ఆశ ఉండేదని, కానీ, వారి ఆశలన్నింటినీ పదేళ్ల కాలంలో అడియాసలు చేశారని దుయ్యబట్టారు. ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వలేదు సరికదా.. తెలంగాణ కోసం పోరాడిన లక్షలాదిమంది ఉద్యమకారులకు బీఆర్ఎస్‌లో ఇసుమంత గౌరవం కూడా దక్కలేదని మండిపడ్డారు. చివరికి, అమర వీరుల స్మారక స్థూపం, అంబేద్కర్ విగ్రహం నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన ఆమె ఆ పార్టీ ఎమ్మెల్సీ పదవికి గతంలోనే రాజీనామా పత్రాన్ని సమర్పించిన విషయం తెలిసిందే.

మిగతా 2లో



## విద్యారంగ సమస్యలపై 75 ఏళ్లకు పైగా ఏబీవీపీ పోరాటం

- ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలు శంషాబాద్‌లో ముగింపు
- దేశం, ధర్మం కోసం ప్రాణత్యాగాలకు సిద్ధం: బండి సంజయ్
- నక్సల్స్ చేతిలో ఏబీవీపీ కార్యకర్తల బలిదానాలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల్లో విద్యావ్యవస్థకు నష్టం
- పాఠశాలల మూసివేతలపై తీవ్ర ఆందోళన
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరాటాలకు పిలుపు
- విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు ఉధృతం చేయాలని సూచన
- జనమంచి గౌరీశంకర్ యువ పురస్కార్ ప్రదానం

2లో

## అసెంబ్లీలో బీఆర్ఎస్ గైర్హాజరుపై భట్టి ప్రశ్నలు..

# అభివృద్ధి నిర్ణయాలు వెల్లడి

- సభకు రాకపోవడంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించిన భట్టి విక్రమార్క
- ఉపాధి హామీ అంశాలపై చర్చ వారికి ముఖ్యం కాదా?
- అన్ని అంశాలపైనా చర్చకు సిద్ధమే: డిప్యూటీ సీఎం
- పాలమూరు–రంగారెడ్డి చర్చకు బీఆర్ఎస్ వాకౌట్
- సభ నిర్వహణ స్పీకర్ పరిధిలోనే: భట్టి స్పష్టం
- 94 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు
- మూడు దశల్లో ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం
- జీహెచ్ఎంసీ అప్పులన్నీ బీఆర్ఎస్ హయాంలోవే
- ప్రస్తుతం జీహెచ్ఎంసీ బకాయి రూ.4,717 కోట్లు
- 105 యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణానికి నిర్ణయం
- 2028 నాటికి 79 గురుకుల భవనాల పూర్తి లక్ష్యం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

:''బీఆర్ఎస్ సభ్యులకు ఇబ్బంది అయిన రోజున శాసనసభ నుంచి వాకౌట్ చేశారు.. సరే! మిగతా రోజుల్లోనూ వారు సభకు ఎందుకు రావట్లేదు?'' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం పేరు మార్పు, పథకాన్ని నిర్వీర్యం చేయడంపై చర్చ వారికి ముఖ్యం కాదా అని నిలదీశారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. శాసనసభలో అన్ని అంశాలపైనా చర్చించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టు పట్టిందని, వారి కోరిక మేరకు తాము అన్ని అంశాలపైనా చర్చ పెడుతున్నామని చెప్పారు. పాలమూరు రంగారెడ్డిపైన చర్చ పెడితే వారు పారిపోయారన్నారు. సభ ఎన్ని రోజులు నడపాలన్నది స్పీకర్ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు.

లేకుండా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంస్కరణలు అమలు చేయడంతోపాటు ఆధునిక సౌకర్యాలతో మూడు దశల్లో 94 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

మిగతా 2లో



## కవిత పార్టీపై రాంచందర్‌రావు సెటైర్లు..

# 'మారేదేమీ లేదు'

- కవిత పార్టీ ఏర్పాటుపై బీజేపీ చీఫ్ వ్యంగ్య వ్యాఖ్యలు
- పార్టీ పెట్టుకుంటే మారేదేమీ లేదంటూ రాంచందర్‌రావు
- కవిత ఆరోపణలపై విచారణ కమిషన్ వేయాలన్న డిమాండ్
- ఆరోపణలకు ఆధారాలు కమిషన్‌కు ఇవ్వాలంటూ సూచన
- లిక్కర్ కేసు, జైలు అంశంపై కవితపై విమర్శలు
- ఆత్మగౌరవం కుటుంబ విషయం మాత్రమేనంటూ వ్యాఖ్యలు

2లో



## సంక్రాంతికి 5 వేలకు పైగా ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి తెలంగాణ, ఏపీలోని పలు జిల్లాలకు 5 వేలకు పైగా ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తెలంగాణలోని జిల్లాలకు మూడురోజుల్లో 2,500కు పైగా ఏపీకి 3 వేల వరకు స్పెషల్ బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రత్యేక బస్సుల వివరాలు ప్రకటిస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. జనవరి 9 శుక్రవారం నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు నడిపేలా ఆర్టీసీ బస్సులు సిద్ధం చేస్తోంది. ముందస్తు రిజర్వేషన్ల కోసం పెద్దసంఖ్యలో బస్సులను అందుబాటులోకి ఉంచుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీఆర్ఎస్‌కు నైతికత లేదు



(మొదటి పేజీ తరువాయి)

దానిని ఆమోదించాలని విజ్ఞప్తి చేస్తూ సోమవారం ఆమె మండలిలో ప్రసంగించారు. అనంతరం గన్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఆయా సందర్భాల్లో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీపైనా.. తన తండ్రి కేసీఆర్‌పైనా, ఆయన పాలనపైనా తీవ్ర ఆరోపణలు చేశారు. కొద్ది రోజులుగా తనలో దాచుకున్న ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా కంట తడి పెట్టుకున్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా మార్పు చేయడాన్ని తాను అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించానని, తెలంగాణలో ఏం పీకి కట్టామని, జాతీయస్థాయిలో పీకుతామంటూ బీఆర్‌ఎస్‌గా మార్చారని తీవ్రంగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవి ద్వారా చేయాల్సిన పనులకు కట్టుబాట్లు ఎదురయ్యాయని, అందుకే, ఇష్టపూర్తిగానే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

''నాది ఆస్తుల కోసం పోరాటం అంటూ ప్రచారం చేస్తున్నారు. రాజకీయం కోసం కాంగ్రెస్ దాన్ని వాడుకుంటోంది. మా ఇలవేల్పు లక్ష్మీనర్సింహస్వామి మీద.. మాఇద్దరు పిల్లల మీద ప్రమాణం చేసి చెబుతున్నా.. ఇది ఆస్తుల పంచాయితీ కాదు. ఆత్మ గౌరవం కోసమే నా పోరాటం'' అని కవిత స్పష్టం చేశారు. అమెరికా నుంచి 2004 ఆగస్టు లో వ్యక్తిగత పని మీద హైదరాబాద్ వచ్చిన తాను.. కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోకి వచ్చానని తెలిపారు. ఎంతోమంది ఉద్యోగాలకు రాజీనామా చేసి అప్పటికే ఉద్యమంలోకి వచ్చారని.. వారి స్ఫూర్తితో తానూ వచ్చానన్నారు. అప్పటికే టీఆర్ఎస్ రాజకీయ పార్టీగా ఎదిగిందని, కేసీఆర్ కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్నారని గుర్తు చేశారు. అయినా.. ''నేను సొంతంగా జాగృతి సంస్థ ద్వారా యువతను, మహిళలను ఉద్యమంలోకి తీసుకువచ్చి అనేక కార్యక్రమాలు నిర్వహించా. మన ఆత్మగౌరవ ప్రతీకగా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు పలు కార్యక్రమాలు చేశా. మీడియా, సినిమాల్లో తెలంగాణ యాస, భాషకు జరుగుతున్న అవమానంపై పోరాటం చేశా. అప్పట్లో శ్రీకృష్ణ కమిటీకి తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సమగ్ర వివరాలు అందిస్తే అవన్నీ నిజమేనని కమిటీ ఫైనల్ రిపోర్ట్‌లో స్పష్టం చేసింది. '' అని వివరించారు. ప్రత్యేకించి తెలంగాణలోని సంస్థల్లో స్థానికులకు ఉద్యోగాలు రావాలని పోరాటం చేశానని చెప్పారు. వాస్తవానికి రాజకీయాల్లోకి రావాలని తాను అనుకోలేదని, అంతర్జాతీయ స్థాయిలో ఎన్‌జీఓను నడపాలనే ఆలోచనతో ఉన్నానని, కానీ, బీఆర్ఎస్ పార్టీ వాళ్లే పిలిచి నిజామాబాద్ పార్లమెంట్ టికెట్ ఇచ్చారని తెలిపారు. ఏ మహిళ అయినా పిల్లలను వదిలి రాజకీయాల్లోకి రావాలంటే ఆలోచన చేస్తుందని, తాను కూడా 4 నెలలపాటు తన జీవిత భాగస్వామితో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నానన్నారు. నిజామాబాద్ ప్రజలతో ఉన్న సన్నిహిత సంబంధాలతోనే తనకు ఎంపీ టికెట్ ఇచ్చారని, ఫలితంగా అక్కడి మొత్తం ఎమ్మెల్యే స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుందని చెప్పారు.

కొత్తగా వచ్చినవాళ్లు, ఉద్యమంతో సంబంధం లేని వాళ్లు సైతం తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర ఏమిటని ప్రశ్నిస్తున్నారని, అందుకే ఈ విషయాలు చెబుతున్నానని కవిత వ్యాఖ్యానించారు. గల్లీలోనే కాదు.. ఢిల్లీలో సైతం తాను ఉద్యమం చేశానన్నారు. 2013, 2014లో ఉద్యమంలో కీలక సంఘటనలు జరిగాయి. తెలంగాణ కోసంమాట్లాడాలని పిలిస్తే కుటుంబసమేతంగా ఢిల్లీ వెళ్లాం. రెండు నెలలపాటు అక్కడ ఏ కాంగ్రెస్ నాయకుడూ పలకరించలేదు. పట్టించుకోలేదు. అప్పుడు ఆస్కార్ ఫెర్నాండెజ్‌తో కేసీఆర్‌కు సమావేశం ఏర్పాటు చేయించా. ఆ మరుసటి రోజే సోనియా గాంధీ ఒక్క రోజులోనే ఏడెనిమిదిసార్లు కేసీఆర్‌తో సంప్రదింపులు జరిపారు'' అని వెల్లడించారు. 2013 ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఉద్యమకారులంతా నిప్పుల కుంపటి మీద కూర్చున్నట్లు భయపడాల్సి వచ్చిందని, ఆంధ్రా లాబీ కారణంగా తెలంగాణ ఏర్పాటు ఎక్కడ ఆగిపోతుందోనని అంతా భయపడ్డామని గుర్తు చేశారు. దీపం చుట్టూ చేతులు పెట్టి కాపాడుకున్నట్లు తెలంగాణ ఏర్పాటు ఆగిపోకుండా కాపాడుకున్నామని, ఆ తర్వాతే పార్లమెంట్ ఉభయ సభల్లో తెలంగాణ బిల్లు పాసయిందని, ఇందులో తన పాత్ర ఉందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ 2014 ఎన్నికల్లో గెలిచినప్పుడు తెలంగాణకు స్వీయ రాజకీయ అస్థిత్వం ఉంటుందని సంతోషపడ్డానని, ఆ తర్వాత కూడా విభజన అంశాలు, హైకోర్టు సాధన, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అనుమతుల కోసం పోరాటం చేశానని కవిత వివరించారు. ఏ రోజూ పదవులు, రాజకీయం కోసం వెళ్లలేదని, ఏ పాత్ర ఇస్తే ఆ పాత్రలో శక్తికి మించి పని చేసేందుకు కృషి చేశానని చెప్పారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పెద్దపల్లి నిజామాబాద్ రైల్వే లైన్‌ను ఎంపీగా ఎన్నికైన వెంటనే పూర్తి చేయించానని చెప్పారు. ''జాగృతి పేరుతో 8 ఏళ్ల పాటు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించా. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో మొదటి బతుకమ్మ ఉత్సవాల నుంచే నాపై ఆంక్షలు మొదలయ్యాయి. మొదటి రోజు నుంచే కట్టడి చేస్తూ భావ ప్రకటన స్వేచ్ఛను హరించారు. ఆ (బీఆర్ఎస్) పార్టీ చానల్ గానీ, పార్టీ పేపర్ గానీ ఎప్పుడూ నాకు మద్దతివ్వలేదు. అయినా ధైర్యంతో ముందుకు వెళ్లా'' అని తెలిపారు.

టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చాలన్న నిర్ణయాన్ని తాను అంగీకరించలేదని కవిత చెప్పారు. తెలంగాణలో ఏమి పీకి కట్టామని.. జాతీయ స్థాయిలో పీకుతామని వ్యాఖ్యానించారు. పదేళ్లలో రూ.1.89 లక్షల కోట్లు ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకే నీళ్లు ఇచ్చారని, అవే డబ్బులతో 25 లక్షలమంది పేదలకు ఇళ్లు ఇవ్వవచ్చునని వ్యాఖ్యానించారు. ఉద్యమకారుల సమస్యలు కేసీఆర్‌కు చేరకుండా అడ్డుగోడ కట్టారని విమర్శించారు. ఏ పార్టీ అయినా రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలని, బీఆర్‌ఎస్‌లో ఆ స్ఫూర్తితో లేదని విమర్శించారు. ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని తూర్పారబట్టారు.

కేసీఆర్‌పై కక్షతో తనను జైల్లో పెట్టారని, ఆ సమయంలో పార్టీ తనకు అండగా నిలవలేదని, వదిలేసిందని, ఈడీ, సీబీఐలతో మూడేళ్లు తానే పోరాడానని కవిత వెల్లడించారు. ఘోష్ కమిషన్ విచారణ సందర్భంగా కేసీఆర్‌ను ఎన్నో మాటలు అంటే ఒక్క బీఆర్ఎస్ నాయకుడూ మాట్లాడలేదని, జాగృతి ద్వారా తానే పోరాడానని గుర్తు చేశారు.

హరీశ్ రావు పేరు చెప్పిన రెండు గంటల్లోనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని, ఉరి తీసేవాళ్లను సైతం చివరి కోరిక ఏమిటని అడిగే గొప్ప దేశం మనదని, కానీ, తనను మాత్రం అన్యాయంగా పార్టీ నుంచి వెళ్లగొట్టారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి కేవలం ఎనిమిది పేజీల రాజ్యాంగం ఉందని, అదో పెద్ద జోక్ అని కవిత అభివర్ణించారు. ''నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు రాత్రికి రాత్రే డిసిప్లినరీ యాక్షన్ కమిటీ పుట్టుకొచ్చింది. నోటీసులు ఇవ్వకుండా, నా వివరణ అడగకుండా సస్పెండ్ చేశారు. నా సస్పెన్షన్‌పై న్యాయపరంగా సవాల్ చేయొచ్చు. కానీ, నైతికత లేని బీఆర్‌ఎస్‌పై చాలెంజ్ చేయను. ఆ పార్టీకి దూరమవుతున్నందుకు సంతోషంగా ఉన్నా'' అని కవిత వ్యాఖ్యానించారు.

తెలంగాణలో అవినీతి లేని పారదర్శక విధానాన్ని చూడాలనుకున్నామని, కానీ జరగలేదని కవిత వ్యాఖ్యానించారు. పార్టీలో, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని కవిత వెల్లడించారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు చేస్తున్న అవినీతిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవని వివరించారు. ''అమరజ్యోతి, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణంలో అవినీతి జరిగింది. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. నిజాన్ని సూటిగా మాట్లాడితే నన్ను నిర్లక్ష్యం చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కాదు కదా.. వారికి కనీసం పెన్షన్ కూడా ఇవ్వలేదు. 1969 ఉద్యమకారులనూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైన్‌కు గండి కొట్టేశారు. ఇసుక దందాల కారణంగా నేరెళ్ల లాంటి దురాగతాలు జరిగాయని, అయినా అప్పట్లో చర్యలు తీసుకోలేదని తెలిపారు. కేసీఆర్ కూతురిగా ఆయనను అడిగే ధైర్యం తనకుందని, తాను అడిగిన ఒకటి, రెండు చేయకపోయినా పర్వాలేదని, కానీ, కొంతమంది వరుసగా దురాగతాలకు పాల్పడినా పట్టించుకోలేదని తప్పుబట్టారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలతో తెలంగాణకు నష్టమని కేసీఆర్ ఉద్యమ సమయంలో అన్నారని, సీఎంను కూడా కాంట్రాక్టు పద్ధతిలో పెడతారా? అని అప్పట్లో ప్రశ్నించేవారని, కానీ, తెలంగాణ వచ్చాక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయకపోగా పెంచి పోషించారని తప్పుబట్టారు. ధర్నా చౌక్‌ను తీసేయాలని నిర్ణయించినప్పుడు తాను వ్యతిరేకించానని, తెలంగాణ వచ్చాక ధర్నా చౌక్ ఎందుకని.. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని కేసీఆర్ చెప్పారని, కానీ, అవేవీ అమలు కాలేదని తప్పుబట్టారు.

ఇప్పుడు తన దారి వేరైనా లక్ష్యం మాత్రం ఒక్కటేనని, తెలంగాణ ప్రజలు బాగుండాలని, వారి కోసం తాను పని చేస్తూనే ఉంటానని కవిత స్పష్టం చేశారు. తాను నిజం, నైతికత వైపు నిలబడి ఉన్నానని చెప్పారు. ప్రస్తుతం సభలో ప్రతిపక్షం లేదని, భవిష్యత్తులో తాము ప్రజల ఆకాంక్షలను సాకారం చేస్తామని చెప్పారు. ''అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతి రాజకీయ పార్టీగా మారుతుంది. తెలంగాణ కోసమే కొట్లాడే కొత్త పార్టీ ఇప్పుడు అవసరం. వ్యక్తిగా బయటకు వెళ్తున్నా. శక్తిగా మళ్లీ వస్తా. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలను చేరాలని విజ్ఞప్తి చేస్తున్నా. నా ప్రయత్నానికి మీ మద్దతు కావాలి. నిరుద్యోగులు, మహిళలు ఆశీర్వదించాలి. వామపక్షాలు, మావోయిస్టు సానుభూతిపరులు, ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసే పార్టీ రావాలనుకుంటున్న వారు మద్దతివ్వాలి. నిరుద్యోగులకు కొత్త ఉపాధి అవకాశాలు రావాలంటే నాతోపాటు పోరాడండి. ఆదివాసీ, గిరిజన, దళిత, మైనార్టీ బిడ్డలకోసం పోరాటం చేసే పార్టీ కావాలి. ఒక ఆడబిడ్డగా ముందడుగు వేస్తున్నా.. నన్ను ఆశీర్వదించండి. తెలంగాణ ఆడబిడ్డలకు పౌరుషం ఎక్కువ. ఏదీ కావాలని అడగం. కానీ, మనల్ని అవమానిస్తే ఊరుకోం'' అని కవిత వ్యాఖ్యానించారు. దేవుడి దయతో గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతామన్న నమ్మకం ఉందని, కచ్చితంగా ఓ కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మిస్తానని అన్నారు. రాష్ట్రంలో మహిళా ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం తక్కువగాఉందని, అది 0.0003 శాతమేనని వివరించారు. ఆడవాళ్లకు కష్టాలు వస్తే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. అన్ని పార్టీలూ రాజ్యాంగాలను మార్చుకుని మహిళలను ప్రోత్సహించాలని కోరారు.

# విద్యారంగ సమస్యలపై 75 ఏళ్లకు పైగా ఏబీవీపీ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

విద్యారంగ సమస్యలపై 75 ఏళ్లకు పైగా అలుపెరగకుండా పోరాడుతున్న చరిత్ర అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. దేశం కోసం.. ధర్మం కోసం ఏబీవీపీ కార్యకర్తలు ప్రాణత్యాగాలకైనా వెనుకాడకుండా పోరాడుతున్నారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరుగుతున్న ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ ముగింపు ఉత్సవాలకు కేంద్ర మంత్రి హాజరై మాట్లాడారు. నాడు నక్సల్స్ చేతిలో ఎంతో మంది ఏబీవీపీ,



పరివార్ క్షేత్ర కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో తెలంగాణ విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నమైందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో 6 వేల పాఠశాలు మూసేస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దాదాపు 1,500 బడులు మూతపడ్డాయన్నారు. . ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్ర విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ పోరాటాలు ఉధృతం చేయాలని సూచించారు. అంతకుముందు 'జనమంచి గౌరీశంకర్ యువ పురస్కార్'ను భీమనపల్లి శ్రీకాంత్‌కు ప్రదానం చేసి రూ.50 వేలను నగదు బహుమతిగా అందించారు.

# పోలవరం—నల్లమల సాగర్‌పై స్టే కోరనున్న తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

12న జరిగే విచారణకు స్వయంగా తానే హాజరవుతానని చెప్పారు. రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు. సోమవారం మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక సైతం వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి హరీశ్‌రావు చూపిస్తున్నది అంతర్గత సమాచారం కోసం సీడబ్ల్యూసీ పంపిన లేఖ అని, ఇది ప్రాజెక్టును ఆమోదించినట్లు కాదని అన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే బీఆర్ఎస్ నేతలు అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాగా, తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు డీపీఆర్ తయారీ కోసం రూ.10కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో అవసరమైన చోట్ల కొత్త రేషన్‌షాపులు మంజూరు చేస్తామని ఉత్తమ్ ప్రకటించారు.



## అసెంబ్లీలో బీఆర్ఎస్ గైర్హాజరుపై భట్టి ప్రశ్నలు..

# అభివృద్ధి నిర్ణయాలు వెల్లడి


(మొదటి పేజీ తరువాయి)

నిర్మించనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ నెలాఖరులోగా మొదటి దశలో పది సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. మండలిలో సభ్యుడు ఏవీఎన్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 94 అద్దె భవనాల్లో కొనసాగుతుండగా.. 50 ప్రభుత్వ భవనాల్లో ఉన్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. జీహెచ్ఎంసీ కోసం ఎలాంటి అప్పులు తీసుకోలేదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జీహెచ్ఎంసీ అప్పుల గురించి అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీకి ఉన్న అప్పులన్నీ బీఆర్ఎస్ హయాంలో చేసినవేనని స్పష్టం చేశారు. 2025 డిసెంబరు 31 నాటికి జీహెచ్ఎంసీ బకాయి ఉన్న రుణం రూ.4,717 కోట్లు అని వివరించారు. గత 12 నెలల్లో రుణ మొత్తం పెరగలేదన్నారు.

రాష్ట్రంలో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా ఇప్పటికే 79 గురుకులాల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. 76 భవనాల నిర్మాణానికి టెండర్లు పిలిచామని, 12 భవనాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. మరో 6 స్కూళ్ల కోసం స్థలాల ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఒక్కో భవనాన్ని 18 నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి జవాబు ఇచ్చారు. 2027 జూన్ కల్లా 70 గురుకులాల భవనాల నిర్మాణం పూర్తవుతుందని, 2028 జూన్ కల్లా మరో 9 గురుకుల భవనాలు నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు.

కేరళ స్థాయిలో తెలంగాణలో పర్యాటక అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. గతంలో పర్యాటక రంగానికి పాలసీ లేకపోవడంతోనే ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నూతన పర్యాటక విధానం తెచ్చామని చెప్పారు. పర్యాటక రంగాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయడానికి వీలుగా, దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాయితీలు ఇస్తున్నామని తెలిపారు.



గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల్లో ఉన్న 67లక్షల మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశామని, మార్చి 1 నుంచి పట్టణ ప్రాంతాల్లోని సంఘాల మహిళలందరికీ చీరలు అందజేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో కొనుగోలు చేసేందుకు మరో 40లక్షల చీరలను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

## కవిత పార్టీపై రాంచందర్‌రావు సెటైర్లు..

# 'మారేదేమీ లేదు'

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కల్వకుంట్ల కవిత పార్టీ ఏర్పాటుపై రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సెటైరికల్ కామెంట్స్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. కవిత పార్టీ పెట్టుకుంటే మారేది ఏమీ లేదు అంటూ వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై కవిత చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ కమిషన్ వేయాలి. ఆరోపణలు చేసిన కవిత.. తన వద్ద ఉన్న ఆధారాలను ఆ కమిషన్‌కు ఇవ్వాలి. ఇన్నాళ్లు అవినీతిలో అంటకాగి పంపకాల్లో తేడాలతోనే కవిత బీఆర్ఎస్ నుంచి బయటికి వచ్చారు. లిక్కర్ వ్యాపారం చేసి కవిత జైలుకు వెళ్లారు. లిక్కర్ కేసులో డబ్బులు సంపాదించారు.

కవిత జైలుకు వెళ్లితే బీజేపీకి ఎం సంబంధం?. తప్పుచేసిన వారిని పార్టీలు జైలులో వేయవు. దర్యాప్తు సంస్థలు వేస్తాయి. కవితకు మాత్రమే ఆత్మగౌరవం



ఉందా? తెలంగాణ ప్రజలకు లేదా?. ఆమె ఆత్మగౌరవం ఎలా దెబ్బతిందో అనేది వాళ్ల కుటుంబ అంశం మాత్రమే. ఇన్నాళ్లు వాళ్లతో ఉన్నప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదు. ఉద్యమ ద్రోహులు బీఆర్ఎస్‌లో చేరారని మేము మొదటి నుంచి చెప్పాం' అంటూ కామెంట్స్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కేటీఆర్ ఖమ్మం పర్యటనను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పిలుపు.



**సత్తుపల్లి, జనవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జనవరి 07 (బుధవారం) నాడు ఖమ్మం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన గ్రామ సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమాన్ని అదే రోజు ఉదయం 10 గంటలకు ఖమ్మం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ సన్మాన కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేటీఆర్ పర్యటన పార్టీకి మరింత బలాన్నిచ్చే అంశంగా నిలవనుందని, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులను గౌరవించడం ద్వారా పార్టీపై ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత పటిష్టమవుతుందని సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. పార్టీ ఐక్యత, క్రమశిక్షణతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు.

# గురుకులాల బలోపేతానికి రూ.10.65 కోట్లు మంజూరు



- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

**వనపర్తి, జనవరి5(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి నియోజకవర్గంలోని గురుకుల,ఆశ్రమ,రెసిడెన్షియల్ విద్యాసంస్థల మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ ఫలించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.10.65 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యార్థులకు మెరుగైన వసతులు,నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పలు గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల బలోపేతంపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఖిల్లా ఘణపురం మండలంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో డార్మెటరీతో పాటు డైనింగ్ హాల్ నిర్మాణాలకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి.అలాగే వనపర్తి మండలం మర్రికుంటలోని బాలికల గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలో డైనింగ్ హాల్,వంట గదుల నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేయగా, అదే పాఠశాలలో అధ్యాపక నివాస సముదాయం (స్టాఫ్ క్వార్టర్స్) నిర్మాణానికి మరో రూ.1.50 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.పెద్దమందడి మండలం బుగ్గపల్లి తాండ-రాజపేట శివారులోని బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్‌తో పాటు అధ్యాపక నివాస భవనాల నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.అదేవిధంగా అర్బన్ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహం నిర్మాణానికి రూ.2.65 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.ఈ నిధులతో చేపట్టనున్న భవన నిర్మాణ పనుల ప్రారంభానికి సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని ఎమ్మెల్యే వెల్లడించారు. నిర్మాణాలు పూర్తయితే వనపర్తి నియోజకవర్గ పరిధిలోని గురుకుల, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు మరింత బలోపేతం అవుతాయని,విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి,మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.

# అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

## ఆరోగ్య లక్ష్మి కమిటీ ఏర్పాటు

**వనపర్తి,జనవరి5(తెలంగాణ ముచ్చట్లు):**






పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని 3వ అంగన్వాడి కేంద్రాన్ని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కమిటీని ఏర్పాటు చేసి, కేంద్ర నిర్వహణ, పిల్లల హాజరు,పోషకాహార పంపిణీ వ్యవస్థపై సమగ్రంగా పరిశీలించారు.అంగన్వాడి కేంద్రంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతోందా అనే అంశాలపై సర్పంచ్ ఆరా తీశారు. అలాగే పోషకాహారం సరఫరా విధానం, నాణ్యత,నిర్వహణపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్భంగా విద్యార్థులకు మరియు గర్భిణీ స్త్రీలకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు ప్రతి నెల ప్రభుత్వం ద్వారా అందే పాలు, గుడ్లు, బాలామృతాన్ని సకాలంలో తీసుకొని, పిల్లలను ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రతిరోజూ అంగన్వాడి కేంద్రానికి పంపించాలని సర్పంచ్ సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ గ్రామ అభివృద్ధికి పునాదని పేర్కొన్న సర్పంచ్, అంగన్వాడి కేంద్రాల పనితీరును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణేష్,నాయకులు ,ఎస్.రాములు,పోతుల రామిరెడ్డి,రామకృష్ణారెడ్డి, శ్రీ బోయిన కృష్ణ,బాలాజీ,ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఓణీల–పంచకట్టు వేడుకల్లో చిన్నారులను ఆశీర్వదించిన సోయం వీరభద్రం

**దమ్మపేట, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం పార్కెలగండి గ్రామంలో కుంజా దావీదు-పార్వతి దంపతుల కుమార్తె తేజశ్రీ, కుమారుడు ప్రణయ్‌కు మార్‌ల ఓణీల మరియు పంచకట్టు వేడుకలు బంధుమిత్రుల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అశ్వరావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం పాల్గొని, దమ్మపేట మండలం మాజీ సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావుతో కలిసి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లలు మంచి సంస్కారాలు, ఉత్తమ విద్యతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలు వగ్గేల పూజ, పార్కెలగండి గ్రామ సర్పంచ్ కొమరం సుశీల, బిఆర్ఎస్ యువజన నాయకులు కాకా శివశంకర్ ప్రసాద్, పద్దం అశోక్‌తో పాటు గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ భవన నిర్మాణానికి అనుమతి.!

- ఛలో ఖమ్మంతో ఫలించిన ఐదేళ్ల పోరాటం

**సత్తుపల్లి, జనవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**





బీసీ భవన నిర్మాణం కోసం 2020 నుంచి కొనసాగిన ఐదేళ్ల సుదీర్ఘ పోరాటం విజయవంతమైంది. మద్దిశెట్టి సామేలు నాయకత్వంలో సాగిన ఉద్యమంలో భాగంగా నిర్వహించిన ఛలో ఖమ్మం కార్యక్రమం నిర్ణాయకంగా మారింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోచారి 2020లో ఇచ్చిన లేఖ ఆధారంగా, కల్లూరు ఆర్డీవో సూర్యనారాయణ, సత్తుపల్లి తహసీల్దార్ కలిసి సత్తుపల్లి మండలం అయ్యగారుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 184/పీ లో ఉన్న ఐదు గుంటల ప్రభుత్వ భూమిని సర్వే చేసి ఖాళీగా ఉన్నట్టు నిర్ధారించారు. ఖాళీ ప్రభుత్వ స్థలం ఉన్నట్టు గుర్తించిన రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం ఖమ్మంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార దినంలో ఎన్సీపీ పార్టీ - ఎన్డీఏ మహాకూటమి తరఫున బీసీ భవన నిర్మాణానికి సంబంధించిన పూర్తి పత్రాలను జిల్లా రెవెన్యూ విభాగ అధికారి వద్ద సమర్పించి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం, ఆ స్థలాన్ని బీసీ కార్పొరేషన్‌కు కేటాయించాలని నిర్ణయించింది. భూమి అప్పగింత అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ, ఐదేళ్లుగా నిరంతరంగా సాగిన పోరాటం ఫలితంగా ఈ విజయం సాధ్యమైందన్నారు. సహకరించిన సత్తుపల్లి రెవెన్యూ అధికారులు, కల్లూరు ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పలగాని శ్రీనివాస్ గౌడ్, పుట్టపర్తి హరిబాబు, ఈదుల రవి, బానోతు సీను నాయక్, కొంటె కృష్ణ, మచ్చ గిరి, సునీత తదితరులు పాల్గొన్నారు.



# మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో నూతన వార్డు సభ్యులకు ఘన సన్మానం

**అడ్డాకల్,జనవరి5(తెలంగాణ ముచ్చట్లు):**

మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్నగర్ జిల్లా అడ్డకల్ మండల కేంద్రంలో మహిళా సమైక్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సరిత, మండల స్థాయి ప్రాజెక్టు మేనేజర్ మహేష్ నాయకత్వం వహించారు.ఈ సమావేశంలో బలీదుపల్లి గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు మంగరాయి భార్గవి, అడ్డకుల శ్రీలక్ష్మి గ్రామ మహిళా సంఘం కార్యదర్శి సంధ్య నూతనంగా వార్డు సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా వారికి ఘనంగా సన్మానం నిర్వహించారు.జిల్లా స్థాయి ప్రాజెక్టు మేనేజర్లు లక్ష్మయ్య, రామ్మూర్తి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సరిత, మండల ప్రాజెక్టు మేనేజర్ మహేష్ ఆధ్వర్యంలో నూతన వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజలు నమ్మకంతో గెలిపించిన బాధ్యతను గుర్తించి సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భవిష్యత్తులో మరింత ఉన్నతమైన పదవులు అధిరోహించాలని హాజరైన నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి ప్రాజెక్టు మేనేజర్లు లక్ష్మయ్య, రామ్మూర్తి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు సరిత, మండల ప్రాజెక్టు మేనేజర్ మహేష్, మండల సమన్వయకర్తలు రాజు, సురేష్, యాదగిరి, ప్రమీలరాణి, వివిధ గ్రామాల సంఘ నిర్వహకులు శ్రీధర్ యాదవ్, నసీరుద్దీన్, యాదమ్మ, స్వప్న, మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం.!

## వి.ఎం.బంజర ఎస్సై వెంకటేష్

**సత్తుపల్లి, జనవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**



సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వి.ఎం.బంజర పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకటేష్ అన్నారు. 'ఫ్రాడ్‌కు ఫుల్‌స్టాప్' కార్యక్రమంలో భాగంగా సోమవారం వి.ఎం.బంజర బస్టాండ్‌లో ప్రయాణికులకు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, లోన్లు మంజూరు చేస్తామని అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే నమ్మవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింక్‌లకు స్పందించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరాల వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెరిగితేనే ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఆయన తెలిపారు.

# నూతన ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్వర్గీయ జయరాములు పేరు

- ఎమ్మెల్యే మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

**వనపర్తి,జనవరి5(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే జయరాములు పేరును నామకరణం చేయడం గర్వించదగ్గ విషయమని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వర్గీయ జయరాములు కూతురు కవిత, కుమారుడు వశిష్టలు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.వారు మాట్లాడుతూ స్వర్గీయ జయరాములు వనపర్తి శాసనసభ్యులుగా నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజాసేవకు ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు.గతంలో అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నప్పటికీ తమ తండ్రి సేవలను ఈ విధంగా స్మరించకపోవడం బాధగా ఉండేదని, నేడు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జయరాములు సేవలను గుర్తించి ఆయన పేరును ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు పెట్టడం తమ కుటుంబానికి ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా జయరాములు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ని శాలువాలతో సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే జయరాములు పేరును నామకరణం చేసేందుకు అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన ఎటువంటి అవసరాలైనా తన దృష్టికి తీసుకురావాలని, తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.



## ప్రేమ తిరస్కరించిందని యువతి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి

నిన్ను ప్రేమిస్తున్నా.. నా ప్రేమను అంగీకరించాలని ఓ యువకుడు ఓ యువతి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడిచేశాడు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది . స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఓ యువతి(21) మరో ఇద్దరు యువతులతో కలిసి ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని ఉంటుంది. అదే భవనంలో కొనసాగుతున్న ఓ హోటల్‌లో వెయిటర్‌గా పర్వతాల రోహిత్(23) పనిచేస్తున్నాడు. ఈనెల 1న యువతి కొత్త సంవత్సరం వేడుకల అనంతరం అర్ధరాత్రి ఇంటికి వచ్చింది . అప్పటికీ ఆమె మిత్రులు రాకపోవటంతో తలుపు తెరచి ఉంచి నిద్రకు ఉపక్రమించింది. రెండు నెలలుగా ప్రేమిస్తున్నానని వెంటపడుతున్న రోహిత్ అదే అదనుగా ఇంట్లోకి చొరబడ్డాడు. యువతి అతన్ని గమనించి అరవటంతో కత్తితో దాడి చేశాడు. ఈదాడిలో యువతి చేతికి గాయమైంది. అయినా అతను అసభ్యంగా ప్రవర్తించి పరారయ్యాడు. దీంతో బాధితురాలు ఈనెల 2 నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈవిషయమై సెక్టార్ ఎస్సై మునీందర్‌ను వివరణ కోరగా యువతిపై కత్తితో దాడి, అసభ్యంగా ప్రవర్తించిన రోహిత్‌పై ఫిర్యాదు వచ్చిందని, నిందితునిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## రాజపేట సర్పంచ్ ఎల్లయ్యకు ఘన సన్మానం

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి చేతుల మీదుగా శాలువాతో సత్కారం

**వనపర్తి,జనవరి5(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి మండలం రాజపేట గ్రామ సర్పంచ్ ఎల్లయ్యను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎల్లయ్య సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాండు రావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధి, ప్రజాసేవలో సర్పంచ్ ఎల్లయ్య మరింత ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.






# కుషాయిగూడ పీహెచ్‌సీలో ఎన్‌సిడి ప్రోగ్రామ్‌పై అవగాహన కార్యక్రమం

**కుషాయిగూడ, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

కాప్రా సర్కిల్ కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మేడ్చల్ జిల్లా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సిడి) ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రకళ సందర్శించారు.ఈ సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా అమలు చేస్తున్న నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సిడి) ప్రోగ్రామ్‌పై విస్తృత అవగాహన కల్పించారు. వాడ వాడలా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎన్‌సిడి ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.ఈ శిబిరాల్లో 30 సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా బీపీ, షుగర్,బ్రెస్ట్ క్యాన్సర్,సర్వైకల్, క్యాన్సర్,ఓరల్ క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.అలాగే బస్తీల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేసే ఆశా వర్కర్లకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని డాక్టర్ చంద్రకళ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రమాదేవి, డాక్టర్ సుప్రియ, డాక్టర్ విజయ రాణి, డాక్టర్ గీత, డాక్టర్ మధులిక, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ ప్రసన్నతో పాటు హాస్పిటల్ సిబ్బంది కవిత, సుశీల, పద్మ పాల్గొన్నారు.







## జాతీయస్థాయి రంగోత్సవ్ పోటీలలో స్మార్ట్ కిడ్జ విద్యార్థుల ప్రతిభ

**ఖమ్మం బ్యూరో, జనవరి 5(తెలంగాణ ముచ్చట్లు)**

జాతీయ స్థాయి రంగోత్సవ్ హ్యాండ్ రైటింగ్ మరియు కలరింగ్ పోటీలలో స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు ప్రతిభ కనపరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థులు 39 మంది జాతీయ పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు. విజయం సాధించిన విద్యార్థులకు సోమవారం పాఠశాల కరెస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మెడల్స్ ను అందించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు లాస్య ప్రియ, వేధన్య, మోక్షిత్ కృష్ణ, మనీష్, పునర్వి, యోగితారెడ్డి, ప్రణీత శ్రీ ,జస్విక్, స్వీకృతి, గాత్రి, అభయ్ కృష్ణ, సాయి స్కందన్, నిరూప, ప్రహాసిని, ధన్విక్, ధాత్రి శ్రీ, కార్తీ సుదీక్ష ,సాయిష్, యక్షిత్, వీక్ష, మోక్షశ్రీ, ముబీనలి, చతుర్వేద్, ఆద్య, సహస్ర, దీపక్, హర్షిత, రిషాన్ జాదవ్, పవిత్ర, యశస్విని లకు మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు రంగోత్సవ్ జాతీయ స్థాయి పోటీలలో మెడల్స్ సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పాఠశాల విద్యార్థులు పలు రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి పోటీలలో బహుమతులు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారని పేర్కొన్నారు. చదువుతోపాటు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడం వలన తమ పాఠశాల విద్యార్థులు ఉన్నత స్థాయి పోటీలలో రాణిస్తున్నారని తెలియజేశారు. ఈ విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా, డివిజన్ కమిటీల ఏర్పాటు వేగవంతం చేయాలి

- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశం

**ఉప్పల్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి సత్వరమే జిల్లా, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేయాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు. రానున్న జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని క్షేత్రస్థాయిలో బలంగా నిలబెట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కమిటీల నిర్మాణం ద్వారానే పార్టీ పటిష్టత సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సోమవారం పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.సమావేశంలో జిల్లాలో పార్టీ నిర్మాణం, డివిజన్ స్థాయిలో కమిటీల ఏర్పాటు, రాబోయే ఎన్నికల వ్యూహాలు తదితర కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం.






# ప్లాస్టిక్ వినియోగం పై ఎన్‌ఎస్‌ఎస్ అవగాహన ర్యాలీ..

- ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరం..

**ఖమ్మం బ్యూరో , జనవరి 5(తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం గ్రామంలో కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరం నాలుగో రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ప్లాస్టిక్ వద్దుప్రకృతి ముద్దు, ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం - భవిష్యత్తును కాపాడుకుందాం, చేతి సంచులు వాడుదాం-పర్యావరణాన్ని కాపాడుదాం, చెట్లు నాటుదాం-ఆరోగ్యంగా జీవిద్దాం వంటి నినాదాలతో గ్రామ వీధుల్లో పర్యటిస్తూ ప్రజలకు సందేశం అందించారు. ప్లాస్టిక్‌కు బదులుగా క్లాత్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిళ్లు వినియోగించాలని సూచించారు. ర్యాలీ అనంతరం తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శ్రమదానం నిర్వహించి ఆసుపత్రి ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ధరావత్ సుజాత మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై బాధ్యత తీసుకోవడం అభినందనీయమన్నారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ..తమ గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్యామలాదేవి మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ రామ కుమారస్వామి మాట్లాడుతూ.. చెట్లు మన జీవనానికి ప్రాణవాయువులాంటివని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక చెట్టును పెంచాలని పిలుపునిచ్చారు. అనంతరం క్యాన్సర్ అవగాహన సదస్సులో ఆయుష్ విభాగం డాక్టర్ కనకలక్ష్మి పాల్గొని, క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, సెల్‌ఫోన్ వినియోగానికి పరిమితి పాటించడం అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, గ్రామ ప్రతినిధులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్లు, సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## దమ్మాయిగూడెంలో అంగన్వాడి పిల్లలకు ఏకరూప దుస్తుల పంపిణీ

**ఖమ్మం బ్యూరో, జనవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)**

తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌లో చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి వీరాదాసు వినోద ఆధ్వర్యంలో చేపట్టి, అంగన్వాడి పిల్లలకు దుస్తులఈ సందర్భంగా సర్పంచి వీరాదాసు వినోద మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషణతో పాటు విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పిల్లల సమగ్ర అభివృద్ధికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఉన్నం రాజశేఖర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సావిత్రి, అంగన్వాడి టీచర్లు ఎం. నాగేంద్ర, కె. నాగమణి, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పిండిప్రోలు గ్రామంలో ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం..

**ఖమ్మం బ్యూరో, జనవరి 5(తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం జిల్లా పిండిప్రోలు గ్రామంలో అమెరికా సామ్రాజ్యవాద దౌర్జన్యానికి నిరసనగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా ఆధ్వర్యంలో మాజీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.




ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా ఖమ్మం జిల్లా నాయకులు బండెల వెంకయ్య మాట్లాడుతూ..వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను మరియు ఆయన భార్యను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధంలో ఉంచడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. వెనిజులాలోని పెట్రోలు, సహజ వాయువు, బంగారం, వజ్రాలు, బాక్సైట్ వంటి విలువైన సహజ వనరులను దోచుకునేందుకు అమెరికా ఈ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోసి తమకు అనుకూలమైన పాలకులను అధికారంలోకి తేవడమే అమెరికా అసలైన లక్ష్యమని వెంకయ్య విమర్శించారు. ఇతర దేశాల సార్వభౌమత్వంపై దాడులను వెంటనే ఆపాలని, వెనిజులా అధ్యక్షుడిని తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చర్యలన్నీ అమెరికా సామ్రాజ్యవాద దౌర్జన్యానికి పరాకాష్టగా మారాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వర రావు, రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకులు భానోత్ శంకర్, ఎడ్లపల్లి నవీన్, పసలాది వెంకన్న, పరికిపల్లి మధు, మెట్టు రవి, బొమ్మగాని ఎంకన్న, సోమనబోయిన లింగయ్య, గోకినపల్లి బోసు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం-06- జనవరి 2026





# అణుశక్తి విభాగానికి రూ.129.66 కోట్ల డివిడెండ్ అందజేసిన ఈసిఐఎల్ కంపెనీ

- **2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ చెక్కు అందజేత**

హైదరాబాద్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)

వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్ రంగంలో ఐదున్నర దశాబ్దాలకు పైగా సేవలందిస్తున్న మినీరత్న (కేటగిరీ-1) సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసిఐఎల్), 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 129.66 కోట్ల డివిడెండ్ చెక్కును అణుశక్తి విభాగం (డిఏఈ), భారత ప్రభుత్వానికి అందజేసింది.జనవరి 2, 2026 న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డిఏఈ కార్యదర్శి మరియు అటామిక్ ఎనర్జీ కమిషన్ (ఏఈసీ) చైర్మన్ డాక్టర్ ఎ.కె. మొహంతి, ఈసిఐఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ నుండి డివిడెండ్ చెక్కును స్వీకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎ.కె. మొహంతి, నిరంతరం అద్భుతమైన పనితీరు కనబరుస్తున్న ఈసిఐఎల్ యాజమాన్యాన్ని మరియు ఉద్యోగులను అభినందించారు.అనంతరం మాట్లాడిన ఈసిఐఎల్ సీఎండీ అనురాగ్ కుమార్, ఈ విజయం ఉద్యోగుల అంకితభావంతో కూడిన సమిష్టి కృషి ఫలితమని పేర్కొంటూ, జట్టు స్ఫూర్తి ప్రాధాన్యతను నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఈసిఐఎల్ తరపున ఓఎస్ & డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ అనేష్ కుమార్ శర్మ, డైరెక్టర్ (ఫైనాన్స్) ప్రొటీక్ కుమార్ చక్రవర్తి, జనరల్ మేనేజర్ (నార్త్) బ్రిగేడియర్ రాహుల్ మాలిక్ (రిటైర్డ్), ఏజీఎం (ఫైనాన్స్) రంజన్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ అరెస్ట్‌లు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**కొణిజర్ల ఎస్సై సూరజ్**

ఖమ్మం బ్యూరో, జనవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)

డిజిటల్ అరెస్ట్‌లు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొణిజర్ల ఎస్సై సూరజ్ అన్నారు. ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమంలో భాగంగా కొణిజర్లలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ఉద్యోగాలు, లోన్లు వంటివి ఇప్పిస్తామని ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే నమ్మవద్దని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్‌లు, ఆన్‌లైన్ మోసాల గురించి అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు జాగ్రత్త వహించాలని కోరుతున్నారు, తద్వారా ఆర్థిక మోసాలను అరికట్టవచ్చని వివరించారు.



# గొప్ప ఇస్లాం ధార్మిక బహిరంగ సభను సక్సెస్ చేయండి

- **జనాబ్ ముఫ్తి అలావుద్దీన్ సాహెబ్ పిలుపు**

ఖమ్మం బ్యూరో,జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)

ఇస్లాం ధర్మం బోధనలు పరివర్తన అనే అంశంపై ప్రతి ముస్లిం సోదర సోదరీ మణులు మహమ్మద్ ప్రవక్త మహమ్మద్ స.అ.స. చూపిన మార్గంలో పయనించాలని కోరుతూ...

ఈ నెల 11 న ఖమ్మం నగరం లోని వైరారోడ్ ప్రాంతంలో గల నిజాంపేట్ మస్జిద్ లో గొప్ప ఇస్లాం ధార్మిక బహిరంగ సభను సక్సెస్ చేయాలని జనాబ్ ముఫ్తి అలావుద్దీన్ సాహెబ్ (ఇమామ్ వ ఖతీబ్ మస్జిదే, (నిజాంపేట్.) పిలుపునిచ్చారు.

సోమవారం ఖమ్మంలోని నిజాం పేట్ మస్జిద్ ఆవరణలో ధార్మిక సభకు చెందిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్లాం ధర్మం బోధనలు పరివర్తన సమాజంలోని రుగ్మతలు అనే అంశాలపై ఈనెల 11 వతేది ఆదివారం సా॥గం॥6.30 ని॥లకు గొప్ప ధార్మిక సభ నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ధార్మిక సభకు ముఖ్య అతిథిగా జనాబ్ హజరత్ మౌలానా షేక్ రిజ్వానుద్దీన్ మారూఫి సాహెబ్ (అధ్యాపకులు హదీస్ విభాగం, మదరసా, ఇషాతుల్ ఉలూమ్, అక్కల్ కూవా, మహారాష్ట్ర) సభాధ్యక్షులుగా జనాబ్ హజరత్ మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మి (ఉపాధ్యక్షులు, జె.యు. హెచ్. తెలంగాణ, జిల్లా అధ్యక్షులు, ఖమ్మం.), నిజాం పేట్ మస్జిద్ నిర్వహణ కమిటి ముస్లిం యువత, ఖమ్మం. పర్యవేక్షణలో

జరిగే సభకు ఖమ్మం సోదర, సోదరీ మణులు, అత్యధిక సంఖ్యలో హాజరై ఈ ఆధ్యాత్మిక సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసభకు విచ్చేసిన స్త్రీలకు ప్రత్యేక వరదా సౌకర్యము కూడా కలదని పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తవ్వాఫ్ టూర్ అండ్ ట్రావెల్స్ హజ్ ఉమ్రా సర్వీసెస్ సంస్థ అధినేత, మస్జీద్ ఏ జైన్ హాఫీజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్, మహమ్మద్ సాజిద్, అహ్మద్ ఖాజా, సయ్యద్ గౌస్ పాషా, మహమ్మద్ జఫ్హార్, మహమ్మద్ అఫ్జల్ అలీ, ఎంఏ సమద్, అహ్మద్ పాషా, చాంద్ పాషా, హాఫీస్ అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటు..



**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

ఖమ్మం బ్యూరో, జనవరి -5(తెలంగాణ ముచ్చట్లు)

జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం కొనిజర్ల మండలం పెదగోపతి, చింతకాని మండలం నాగిలిగొండ లలో ఏర్పాటుచేసిన యూరియా పంపిణీ కేంద్రాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు.

యూరియా నిల్వ, రైతులకు యూరియా సరఫరాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 185 యూరియా పంపిణీ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. పంపిణీ కేంద్రాలకు వచ్చిన రైతులకు టోకెన్లు అందజేసి, యూరియా పంపిణీ చేస్తున్నట్లు, రైతులకు పంపిణీ కి కావాల్సిన యూరియా జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు.

అదనపు కలెక్టర్ తనిఖీల సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.



# విద్యార్థులు సైబర్ మోసాల బారిన పడకూడదు

**ఎస్సై వీరేంద్ర...**


ఖమ్మం బ్యూరో, జనవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)






విద్యార్థులు సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని చింతకాని మండలం సబ్ ఇన్స్పెక్టర్ వీరేంద్ర సూచించారు. తిరుమలాపురంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో నాగులవంచ కళాశాల వాలంటీర్లకు సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ల ద్వారా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మోసాలకు గురవుతున్నారని తెలిపారు. తెలియని నెంబర్ ల నుంచి వచ్చే కాల్స్ ను తిరస్కరించాలని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటిపి లేదా వ్యక్తిగత వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని హెచ్చరించారు. అలాంటి సమాచారం ఇవ్వడం వల్ల బ్యాంకు ఖాతాల్లోని డబ్బు ఆన్లైన్ ద్వారా దుర్వినియోగం చేసే అవకాశం ఉందని వివరించారు. అదేవిధంగా ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్స్ కు దూరంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓలు జి. మల్లయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.





# 'అందరివాడు' కు ఆత్మీయ సన్మానం

- **ఆర్యవైశ్య మహాసభ వేదికగా సేవా సంకల్పం**
- **టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తికి సత్కారం**

ఖమ్మం బ్యూరో, జనవరి 5(తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం గుట్టల బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయం ప్రాంగణంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశం, అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య సమాజానికి చెందిన నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావడంతో సభకు విశేష ప్రాధాన్యత లభించింది. ఐక్యతే బలమనే భావన సమావేశమంతా ప్రతిధ్వనించింది.

సమావేశంలో ఇటీవల ఎన్నికైన గ్రామపంచాయతీ ఆర్యవైశ్య చైర్మన్లు, వార్డు సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్, జూబ్లీ క్లబ్, వివిధ దేవాలయాల పాలకవర్గాలకు ఎన్నికైన ఆర్యవైశ్య ప్రతినిధులను వేదికపై ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ప్రయోజనాలకంటే సమాజ హితానికే ప్రాధాన్యం ఇవ్వాలని, సమిష్టి కృషితోనే ఆర్యవైశ్య సమాజానికి గౌరవం పెరుగుతుందని వక్తలు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్ | హెచ్2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తిను ఆహ్వానించి, 'అందరివాడు' గా గుర్తింపు పొందిన ఆయనను సభ వేదికపై ఆత్మీయంగా ఘన సన్మానం చేశారు. నిష్పక్షపాత జర్నలిజంతో ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి స్వరంగా నిలుస్తున్న ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతమైన మీడియా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

అనంతరం ఆర్యవైశ్య మహాసభ భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు జరిపారు. సేవా కార్యక్రమాల విస్తరణ, యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, సాంస్కృతిక విలువల పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అత్యవసరం జిల్లా కలెక్టర్ మను చౌదరి

- **జన విజ్ఞాన వేదిక సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ**
- **అంధ విశ్వాసాల నిర్మూలనకు విజ్ఞానమే ఆయుధం**

మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)




విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, తర్కబద్ధమైన ఆలోచన విధానం పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక వంటి సంస్థల పాత్ర అత్యంత కీలకమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన సైన్స్ క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాస్త్రీయ దృక్పథం లేని సమాజం ముందుకు సాగలేదని, అంధ విశ్వాసాలు, మూఢనమ్మకాలు తొలగించాలంటే విజ్ఞానంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.విజ్ఞానం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రజల రోజువారీ జీవితంలో భాగం కావాలని, ముఖ్యంగా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, తర్కబద్ధమైన ఆలోచన పెరిగితేనే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.సైన్స్ క్యాలెండర్‌లోని అంశాలు చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ విజ్ఞాన సందేశం అందించేలా రూపొందించబడ్డాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజాన్ని చైతన్యవంతం చేస్తాయని అన్నారు. ప్రజల్లో శాస్త్రీయ చైతన్యం పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు.

ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అంధ విశ్వాసాలు, మూఢనమ్మకాలపై పోరాటానికి విజ్ఞానమే ఆయుధమని పేర్కొన్నారు. సైన్స్ క్యాలెండర్‌ను కేవలం తేదీల కోసం కాకుండా, ప్రతి రోజు ఒక విజ్ఞాన ఆలోచన, ఒక తర్కబద్ధమైన సందేశం ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో రూపొందించామని వివరించారు.పిల్లలు ప్రశ్నించాలి, ఆలోచించాలి. ప్రశ్నించని సమాజం ముందుకు సాగదని పేర్కొంటూ, విద్యార్థులు, యువతను కేంద్రంగా చేసుకొని విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక చెకుముకి ఎడిటర్ ఆనంద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాస్, ఎస్.కె. బురాన్, సీనియర్ నాయకులు మల్లయ్య చారి, శంకర్, సిహెచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- ఇందిరాకు రూ.48 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

చిల్కానగర్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)

చిల్కానగర్ డివిజన్, ప్రశాంత్ నగర్ కాలనీలో నివసించే ఇందిరా ఇటీవల స్వల్ప అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందగా, వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.48,000ల చెక్కును చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ స్వయంగా ఇందిరా ఇంటికి వెళ్లి అందజేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌లకు ఇందిరా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి ఫైళ్లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తూ, బాధిత కుటుంబాలకు గరిష్ట సహాయం అందేలా ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇందిరాకు ఏవైనా సహాయ అవసరాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల కొండల రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బీరప్ప గడ్డ బాలు, చిన్న ముదిరాజ్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## వేగం, నైపుణ్యం, సమన్వయంతోనే
# సైబర్ నేరాల కట్టడి



సైబర్ నేరాల్ని సమర్థంగా కట్టడి చేయడంలో వేగం, సాంకేతిక నైపుణ్యం, సమన్వయం అత్యంత కీలకమని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో సైబర్ నేరాల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటువంటి సన్మానాలు అధికారులు తమ నైపుణ్యాల్ని నిరంతరం మెరుగుపరుచుకొనేందుకు ప్రేరణనిస్తాయని చెప్పారు. పౌర కేంద్రిత, సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌పై దృష్టిని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఫ్రంట్ లైన్ అధికారుల్ని సాంకేతికంగా శక్తివంతం చేయడంతో సైబర్ క్రైం ప్రతిస్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించామని సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ తెలిపారు. మొత్తం 25 మంది సైబర్ వారియర్లు, సీఎస్‌బీ కార్యాలయం, సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లకు చెందిన 22 మంది సిబ్బందిని సన్మానించారు.

## చైనీస్ మాంజా వాడుతున్నారా..
### సజ్జనార్ సీరియస్ వార్నింగ్



తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి అనగానే కోడి పందాలు, గొబ్బెమ్మలు, ముగ్గులు, పంతగులు గుర్తుకు వస్తాయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన పంతగులను(కైట్స్) ఎగురవేస్తారు. అయితే, కైట్స్ కోసం వాడే చైనీస్ మాంజా వినియోగంపై నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. చైనీస్ మాంజా విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.
హైదరాబాద్ సీపీ సజ్జనార్ తాజాగా ట్విట్టర్ వేదికగా.. హైదరాబాద్ నగరవ్యాప్తంగా చైనీస్ మాంజాపై ప్రత్యేక నిఘా ఉంది. మాంజా విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులతో సంయుక్త దాడులు చేస్తున్నాం. కైట్స్ షాపులు, గోదాములపై ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. అక్రమ రవాణాపై ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలపై కూడా కేసులు పెడుతున్నాం. చైనీస్ మాంజాతో ప్రాణాపాయం. అందుకే అందరినీ హెచ్చరిస్తున్నాం. మాంజా వినియోగంపై సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యతగా ఉంచుతాం. డయల్ 100/ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 165559కు ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు.







# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం

మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి డీఆర్వో హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్లు మొత్తం 109 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎంతో వ్యయప్రయాసలు భరించి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు ప్రజావాణికి వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను అర్జీదారులకు తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేద, మధ్యతరగతి ప్రజలకు వరం

**మందుముల పరమేశ్వర్‌రెడ్డి**


ఉప్పల్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)
సీఎంఆర్ఎఫ్ పేదలు, మధ్యతరగతి ప్రజలకు నిజమైన వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులను సకాలంలో చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంజూరైన చెక్కులు:ప్రమీల - రూ. 2 లక్షలు,సత్తు కన్నా - రూ. 60 వేలు,జి. సత్యనారాయణ - రూ. 60 వేలు,నితీష్ శ్రీవాణి - రూ. 60 వేలు,చొప్పున మంజూరైన మొత్తాలను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫిక్, తుమ్మల దేవి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, గరిక సుధాకర్, లింగం, పూజారి హనుమంతు, మా శెట్టి రాఘవేంద్ర, కుసంగాల సతీష్‌ముదిరాజ్, తలారి నర్సింగ్, నరసింహ, కిషన్ నాయక్, నయీమ్, హరీష్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో
# యూరియా కదలికలపై సమీక్ష

- రైతులకు కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, జనవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)





జిల్లా వ్యాప్తంగా యూరియా కదలికలు, నిల్వలు, పంపిణీ పరిస్థితులపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి నోడల్ అధికారి ఆశా కుమారితో కలిసి తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె. చంద్రకళకు సూచించారు. యూరియా నిల్వలు, రోజువారీ పంపిణీ, భవిష్యత్ అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల నివేదిక ప్రకారం, 04012026 నాటికి ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీలలో 173.025 మెట్రిక్ టన్నులు,ప్రైవేట్ డీలర్ల వద్ద 210.06 మెట్రిక్ టన్నులు,మార్క్‌ఫెడ్ బఫర్‌లో 405.135 మెట్రిక్ టన్నులు యూరియా స్టాక్ ఉన్నట్లు తెలిపారు.మొత్తంగా జిల్లాలో 788.22 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీఓ వెంకట్ రెడ్డి, డీఎం మార్క్‌ఫెడ్ శ్రీదేవి పాల్గొన్నారు. తదుపరి కమిషనర్ & డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయం నుంచి వచ్చిన నోడల్ అధికారి ఆశా కుమారి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా దేవరయాంజల్ ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీతో పాటు హకీంపేట్ ఫార్మర్స్ సిండికేట్ కోఆపరేటివ్ సొసైటీని పరిశీలించారు.యూరియా నిల్వలు, నిల్వల పరిస్థితిని పరిశీలించిన ఆమె, రైతులకు సరఫరా సహజంగా కొనసాగాలని అధికారులకు సూచించారు. జిల్లాలో యూరియా అందుబాటులో ఉన్నందున రైతులు తమ వాస్తవ అవసరానికి అనుగుణంగా మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు.





# మాటిచ్చారు.. నెరవేర్చారు!

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పీచర సర్పంచ్ అనిత
- మార్కెట్ ఏర్పాటుకు ఎన్నికల్లో హామీ,నెల వ్యవధిలోనే ప్రారంభం

వేలేరు,జనవరి04(తెలంగాణ ముచ్చట్లు):

వేలేరు మండలం పీచర గ్రామంలో ఎన్నికల సమయంలో గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఇచ్చిన హామీలను సర్పంచ్ మరిజె అనిత నరసింహారావు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. అందులో భాగంగా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, నెల వ్యవధిలోనే ఆ హామీని కార్యరూపంలోకి తీసుకువచ్చారు. గ్రామంలో సోమవారం కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించడంతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది.
ఇంతవరకు కూరగాయల కొనుగోలుకు సమీప గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేదని, దాంతో సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పుడు గ్రామంలోనే మార్కెట్ అందుబాటులోకి రావడంతో ఈ సమస్యలు తీరాయని వారు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మహిళలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారిందని, రోజువారీ అవసరాల కోసం దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా సౌకర్యం కలిగిందని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
గ్రామ అవసరాలను గుర్తించి, ప్రజలకు నిత్యావసరమైన సౌకర్యాలపై దృష్టి సారిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని స్థానికులు భావిస్తున్నారు. ఎన్నికల హామీలను మాటలకే పరిమితం చేయకుండా, అమలు చేసి చూపడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచారని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. పీచర గ్రామంలో చేపట్టిన ఈ కూరగాయల మార్కెట్ భవిష్యత్తులో గ్రామ ఆర్థిక చైతన్యానికి కూడా తోడ్పడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గంటకి ఓసారి 5 నిమిషాలు నడిస్తే.. అనారోగ్యం ఇక ఖతం



ఉదయం లేచి 45 నిమిషాల నుండి గంట పాటు వేగంగా నడవడం ఉత్తమ మార్గం. కానీ నేటి బిజీ జీవనశైలిలో, ఎవరూ దీని కోసం ఒక గంట సమయం కేటాయించలేరు. కాబట్టి మనం నడవడం మానేస్తాము. అప్పుడు మనం రోజంతా ఒకే చోట కూర్చుని ఆఫీసులో పని చేస్తాము. ఈ విషయాలు శారీరక ఆరోగ్యాన్ని చాలా చాలా చెడుగా ప్రభావితం చేస్తాయి. ప్రతి గంటకు 5 నిమిషాలు ఎందుకు నడవాలి? మనం రోజంతా ఒకే చోట కూర్చుని పని చేస్తాము. అలా జరిగినప్పుడు, కాళ్ళ కండరాలు బిగుతుగా మారుతాయి. వాటికి వశ్యత ఉండదు. ఇది ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి పరిస్థితిని మరింత దిగజారుస్తుంది. ఈ ఐదు నిమిషాల నడక మీకు సరళంగా, ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. ఉద్యోగాల మధ్య గంటకు ఒకసారి ఐదు నిమిషాల నడకకు సమయం లేదని చెప్పే వారు ఎవరూ లేరు. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది: మీరు గంటల తరబడి లేదా రోజంతా ఒకే చోట కూర్చున్నప్పుడు, మీ నడుము దిగువ భాగంలో, ముఖ్యంగా మీ మోకాళ్ల క్రింద రక్తం పేరుకుపోతుంది, దీని వలన మీ రక్త ప్రవాహం నెమ్మదిస్తుంది. ప్రతి గంటకు 5 నిమిషాలు లేచి నడవడం వల్ల మీ నడుము దిగువ భాగంలో రక్త ప్రవాహం పెరుగుతుంది , ఇది మీ గుండెకు తీసుకెళ్లే ఆక్సిజన్ మొత్తాన్ని పెంచుతుంది. శరీరానికి శక్తి అందుతుంది: ఒకే చోట ఎక్కువసేపు కూర్చునే వ్యక్తులు కొంచెం బద్ధకంగా ఉంటారు. వారు శారీరకంగా అలసిపోతారు. ఏదో ఒక సమయంలో, వారు తమ పనిపై దృష్టి పెట్టలేరు. పరధ్యానంలో మరియు నీరసంగా ఉంటారు. దీనికి ప్రధాన కారణం శరీర శక్తి తగ్గుతుంది. కానీ మధ్యలో ఐదు నిమిషాలు లేచి నడవడం ద్వారా, మీ మనస్సు కూడా ఉల్లాసంగా ఉంటుంది. శారీరక కదలిక, శక్తి స్థాయిలు ఉత్తేజితమవుతాయి. మీరు తక్షణ శక్తిని పొందుతారు. నడక ఇన్సులిన్ నిరోధకతను సరిచేస్తుంది: మధుమేహ వ్యాధిగ్రస్తులకు, కాళ్ళ కండరాల కదలిక ఇన్సులిన్ స్రావాన్ని, దాని వ్యయాన్ని నియంత్రిస్తుంది. మీరు రోజంతా ఒకే చోట కూర్చున్నప్పుడు, మీ రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. మీ బరువు కూడా పెరుగుతుంది. ఇటీవల, వైద్యులు అటువంటి సమస్యలను కొంతవరకు నియంత్రించడానికి తిన్న తర్వాత పది నిమిషాలు నడవాలని మీకు సలహా ఇస్తున్నారు. ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రమే కాకుండా ప్రీడయాబెటిక్స్‌కు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మీ బొడ్డు కుంగిపోకుండా ఉండటానికి ఐదు నిమిషాల నడక: ముఖ్యంగా పొత్తి కడుపులో ఊబకాయం, మద్యం సేవించేవారిలో, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారిలో, రోజంతా ఒకే చోట పనిచేసే వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం జీవక్రియ చాలా నెమ్మదిగా ఉంటుంది మీరు జీవక్రియను ప్రేరేపించాలనుకుంటే, కేలరీలను బర్న్ చేయాలనుకుంటే, శారీరక శ్రమ చాలా ముఖ్యం.మీరు ఉదయం, సాయంత్రం ఎంత నడిచినా, ప్రతి గంట తర్వాత లేదా భోజనం తర్వాత ఒక చిన్న నడక తీసుకోవడం వల్ల మీ శరీరంలో పెద్ద తేడా ఉంటుంది. మీరు తిన్న తర్వాత మీ సీటులో కూర్చుంటే, అది బొడ్డు నొప్పికి కారణమవుతుంది. మీరు దానిని నివారించాలనుకుంటే, మీరు అప్పుడప్పుడు లేచి ఐదు నిమిషాలు చిన్న నడకకు వెళ్ళవచ్చు.



# శీతాకాలంలో ఆరోగ్యంగా ఉండాలా?

శీతాకాలంలో మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే శీతాకాలంలో అనారోగ్యానికి గురయ్యే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఈ కాలంలో ఆహారంపై అధిక శ్రద్ధ తీసుకోవడం చాలా అవసరం. శీతాకాలంలో మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే శీతాకాలంలో అనారోగ్యానికి గురయ్యే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఈ కాలంలో ఆహారంపై అధిక శ్రద్ధ తీసుకోవడం చాలా అవసరం. శీతాకాలంలో ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగాలని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దానిమ్మ రసం తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు నయం అవుతాయట. ఖాళీ కడుపుతో దానిమ్మ రసం తాగితే మీ రోగనిరోధక శక్తి బలపడుతుంది. మీకు ఏవైనా జీర్ణ సమస్యలు ఉంటే, అవి కూడా పరిష్కరించబడతాయి. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నట్లయితే దానిమ్మ జ్యూస్ తాగడం మంచిది. ఎందుకంటే దానిమ్మ రసం బరువు తగ్గడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. దానిమ్మ జ్యూస్ ఆరోగ్యానికి మంచిది. అయితే కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ జ్యూస్ తాగకుండా ఉండాలి. బీపీ, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు దానిమ్మ జ్యూస్ తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# పాలు తాగినప్పుడు ఇలాంటి ఆహారాలు తినకూడదు





పాలు పోషకమైనవి, కానీ కొన్ని ఆహారాలతో కలిపి తీసుకోవడం జీర్ణక్రియను దెబ్బతీసి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. పుల్లని పండ్లు, చేపలు, ఉప్పు, ఊరగాయలు, ఉల్లిపాయలు వంటివి పాలతో కలిపి తీసుకోకూడదు. ఈ కలయికలు కడుపు ఉబ్బరం, అజీర్ణం, చర్మ సమస్యలు వంటి ప్రతికూల ప్రభావాలను కలిగిస్తాయి. సరైన ఆహార కలయికలతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం. పాలు మన రోజువారీ ఆహారంలో అత్యంత పోషకమైన భాగాలలో ఒకటిగా చెబుతారు. పాలు శరీరానికి కావాల్సిన బలాన్ని అందిస్తాయి. శరీర పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పాలు కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డి పుష్కలంగా కలిగి ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి. కానీ పాలను కొన్ని రకాల ఆహారాలతో కలిపి అస్సలు తీసుకోకూడదు. చాలా మందికి పాలు అన్ని రకాల ఆహారాలతో తీసుకోకూడదని తెలియదు. అలాంటప్పుడు పాలను కొన్ని రకాల ఆహారాలతో కలిపి తీసుకోవటం వల్ల లాభాలకంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. పాలతో కలిపి ఎప్పుడూ తినకూడని ఆహారాలు కొన్ని ఉన్నాయి. ఈ కాంబినేషన్ శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. పాలు నారింజ, నిమ్మ, జామ, ఇతర పుల్లని పండ్లు పాలతో కలిపి ఎప్పుడూ తీసుకోకూడదు. ఈ కాంబినేషన్ తీసుకుంటే అవి కడుపులో పాలు గడ్డ కట్టేలా చేస్తాయి. దీని వలన అజీర్ణం, కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలను కలిగిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం పాలు, చేపలను కలిపి తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు ఆటంకం కలుగుతుంది. చర్మంపై మచ్చలు, అలర్జీలు లేదా దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది. పాలు, ఉప్పు కలిగిన ఆహారాల కలయిక జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తుంది. శరీర జీవక్రియ ప్రక్రియను బలహీనపరుస్తుంది. ఇది భారంగా, అసౌకర్యంగా ఉంటుంది. పాలతో ఊరగాయ తినడం వల్ల ఎసిడిటీ, గ్యాస్ సమస్యలు వస్తాయి. ఎందుకంటే పులియబెట్టడం, మసాలా దినుసులు పాలు చల్లదనాన్ని దెబ్బతీస్తాయి. పాలతో ఉల్లిపాయలను తీసుకోవడం హానికరం అని చెబుతారు. ఎందుకంటే ఇది శరీరంలో వేడిని, విషాలను పెంచుతుంది. ఇది జీర్ణవ్యవస్థలో అసమతుల్యతకు దారితీస్తుంది. పాలు, ముల్లంగిని కలిపి తీసుకోవడం వల్ల చర్మ అలర్జీలు, దురద లేదా పుండ్లు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే వాటి వ్యతిరేక లక్షణాలు శరీర సమతుల్యతను దెబ్బతీస్తాయి.

# నల్లగా ఉన్న ఈ ఆహారాలు.. ఆరోగ్యానికి దివ్యఔషధాలు..



చాలా మంది ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి పండ్లు, కూరగాయలను తీసుకుంటారు. అయితే.. తీసుకునే ఆహారం సరైన క్రమంలో తీసుకోవడం చాలా మంచిది. ఆరోగ్యంగా ఉండటానికి బ్లాక్ ఫుడ్స్ కూడా ఎంతగానో సహాయపడతాయి. అయితే ఆరోగ్యాన్ని కాపాడే కొన్ని బ్లాక్ ఫుడ్స్ ఏంటో ఇప్పుడు తెలిసుకుందాం. మీరు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే ఇవి కూడా ట్రై చెయ్యండి. నల్ల అత్తిపండ్లు: అంజీర్ తీపిగా ఉంటుంది. కానీ అందులో చక్కెర పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. ప్రొటీన్, ఫైబర్ వంటి పోషకాలు అధికంగా ఉండే నల్ల అత్తి పండ్లను తినాలని వైద్యులు కూడా సూచిస్తారు. మీరు ప్రతిరోజూ రెండు నల్ల అత్తి పండ్లను రాత్రి నానబెట్టి, ఉదయం పరగడుపున తింటే చాలా మంచిది. నల్ల వెల్లుల్లి: బ్లాక్ వెల్లుల్లి రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. దీంతోపాటు ఈ వెల్లుల్లి గుండెకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది అనేక ఇతర వ్యాధుల నుండి మనల్ని సురక్షితంగా ఉంచుతుంది. మినుములు: ప్రోటీన్ లోపాన్ని అధిగమించడానికి మినుములు తీసుకోవడం మంచిది. వీటిలో కార్బోహైడ్రేట్లు, విటమిన్ బీ6, పొటాషియం, కాల్షియం ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మినుములు తినడం వల్ల గుండెతో పాటు నాడీ వ్యవస్థకు కూడా మేలు కలుగుతుంది. నల్ల ఎండుద్రాక్ష: ఎండుద్రాక్షల్లో ప్రోటీన్, పిండి పదార్థాలు, ఫైబర్, చక్కెర, కాల్షియం, సోడియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ మరియు విటమిన్ సి వంటి అనేక పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. ద్రాక్షలు గుండె, బిపి, ఎముకలు, ఉదరం, జుట్టు, చర్మానికి, రక్తహీనతకు కూడా ఇది మేలు చేస్తుంది. బ్లాక్ రైస్: చాలా మంది వైట్ రైస్ తింటారు. కానీ మీరు ఎప్పుడైనా బ్లాక్ రైస్ గురించి విన్నారా.. వీటిలో పీచు, ప్రొటీన్‌తో పాటు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. బ్లాక్ రైస్ ఒత్తిడిని తగ్గిస్తుంది. బ్లాక్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం చాలా మంచిది.

# సర్వరోగ నివారిణి డ్రాగన్ ఫ్రూట్!



డ్రాగన్ ఫ్రూట్.. ఇది విభిన్నమైన పండు. ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. ఇకపోతే, డ్రాగన్ ఫ్రూట్ డయాబెటిస్ రోగులకు కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌కు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల, రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్.. ఇది విభిన్నమైన పండు. ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. శరీరానికి అవసరమైన పోషకాలు, ఖనిజాలు సమృద్ధిగా నిండి ఉంటాయి. రోజుకో పండు తినటం వల్ల రోజంతా శక్తివంతంగా, ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. డ్రాగన్ ఫ్రూట్‌లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నీరు-డైటరీ ఫైబర్ అధికంగా వున్న డ్రాగన్ ఫ్రూట్ మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఐరన్ పుష్కలంగా ఉండి రక్తహీనతను తగ్గిస్తుంది. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. డ్రాగన్ ఫ్రూట్ తినడం ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి మంచిది. డ్రాగన్ ఫ్రూట్ రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌లోని భాస్వరం, మెగ్నీషియం దృఢమైన ఎముకలు, దంతాల నిర్మాణానికి సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ ఎక్కువగా వుంటుంది. కనుక ఇది బరువు తగ్గడానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల ఉచిత ఆర్గానిక్ ఫైబర్ లభిస్తుంది. ఇది బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఇకపోతే, డ్రాగన్ ఫ్రూట్ డయాబెటిస్ రోగులకు కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌కు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల, రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల డయాబెటిస్ రోగులకు మంచి ఎంపిక. డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో వయస్సు మీద పడే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. అలాగే డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని సంరక్షిస్తాయి. పర్యావరణ కాలుష్యం వల్ల చర్మానికి జరిగే నష్టాన్ని నివారిస్తాయి.

# మైక్రోవేవ్ ఓవెన్‌లో ఫుడ్ వేడి చేస్తున్నారా?

మైక్రోవేవ్ ఓవెన్ ఇప్పుడు ప్రతి ఇంటా ఉండే అనివార్య గాడ్జెట్ అయిపోయింది. 2-3 నిమిషాల్లో ఆహారం వేడెక్కించేయడం, రీహీట్ చేయడం చాలా సులువు. కానీ అన్నీ ఆహార పదార్థాలూ మైక్రోవేవ్ ఫ్రెండ్లీ కావు. మైక్రోవేవ్ ఓవెన్ ఇప్పుడు ప్రతి ఇంటా ఉండే అనివార్య గాడ్జెట్ అయిపోయింది. 2-3 నిమిషాల్లో ఆహారం వేడెక్కించేయడం, రీహీట్ చేయడం చాలా సులువు. కానీ అన్నీ ఆహార పదార్థాలూ మైక్రోవేవ్ ఫ్రెండ్లీ కావు. కొన్ని ఆహారాలు వేడి చేస్తే పోషకాలు నాశనం అవుతాయి, కొన్ని విషపూరితం అవుతాయి, మరికొన్ని పేలి మైక్రోవేవ్‌నే డ్యామేజ్ చేస్తాయి. మైక్రోవేవ్ ఓవెన్ టైమ్ సేవ్ చేస్తుంది కానీ, కొన్ని రకాల ఆహారాన్ని విషపూరితం చేసి ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. ఎట్టిపరిస్థితుల్లో మైక్రోవేవ్? పచ్చి గుడ్లు (షెల్‌తో) ఓవెన్?లో పెట్టకూడదు. వేడికి వీటిలో ఒత్తిడి పేరుకుపోయి పేలిపోతాయి, డోర్ తెరిచినప్పుడు ముఖానికి తగులుతుంది. పెంకు తీసిన ఉడకబెట్టిన గుడ్లు కూడా కొన్నిసార్లు పేలుతాయి, ముందు చిన్నగా కోసి వేడి చేయండి. తల్లి పాలను మైక్రోవేవ్‌లో పెట్టకూడదు. వీటిలోని విలువైన యాంటీబాడీలు, విటమిన్స్ నాశనం అవుతాయి. గోరువెచ్చని నీళ్లలో బాటిల్ పెట్టి వేడి చేయాలి. అల్యూమినియం ఫాయిల్, ఏదైనా మెటల్ పాత్రలను మైక్రోవేవ్‌లో పెడితే స్పార్కస్ వచ్చి అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. బిపిఎ ఉన్న ప్లాస్టిక్ కంటైనర్లు వేడితో హానికర కెమికల్స్ ఆహారంలోకి కలుస్తాయి. బంగారు,వెండి డిజైన్ ఉన్న చైనా ప్లేట్లలో మెటల్ పూత వల్ల స్పార్కస్ వస్తాయి, అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. ఎర్ర మిర్చి, మిరియాల పొడి (ఎక్కువ మొత్తంలో) పెడితే ఆవిరై కళ్లు, ముక్కు మండుతాయి. ద్రాక్ష, బ్లూబెర్రీస్ లాంటి చిన్న పండ్లు పెట్టడం వల్ల ప్లాస్మా ఏర్పడి ఫైర్ బాల్స్ వచ్చే ఛాన్స్ ఉంది. బ్రోకోలి వేడి చేయడం వల్ల యాంటీఆక్సిడెంట్స్ నాశనం అవుతాయి. ఉడికించి తినడం మంచిది.కరివేపాకు, జీలకర్ర పోపు ఉన్న కూరలు పెడితే నూనె చిటపటలాడి ఓవెన్ గోడలు మురికిగా అవుతాయి. పెద్ద ముక్కలుగా కోసిన ఫ్రోజెన్ మాంసం పెట్టడం వల్ల బయట వేడిగా, లోపల గడ్డకట్టి బ్యాక్టీరియా పెరుగుతుంది. స్టైరోఫోమ్ కప్పులు, ప్లేట్లు పెడితే లోపలి రసాయన పొర కరిగి క్యాన్సర్ కారక కెమికల్స్ ఆహారంలో కలుస్తాయి



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కోర్టుకెళతా



పశ్చిమ బెంగాల్ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియను సవాల్ చేస్తూ కోర్టుకు వెళతామని టీఎంసీ చీఫ్, సీఎం మమతా బెనర్జీ సోమవారం ప్రకటించారు. ఎస్ఐఆర్ అధికారుల వేధింపులు, ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలు భయాందోళనలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆమె ఆరోపించారు.

దక్షిణ 24 పరగణాల జిల్లా సాగర్ ఐల్యాండ్‌లో జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడారు. ఎస్ఐఆర్ సిబ్బంది ఎలాంటి సహేతుక కారణాలను చూపకుండానే అర్హులైన ఓటర్ల పేర్లను ఏకపక్షంగా తొలగిస్తున్నారని విమర్శించారు. మామూలుగా చేపట్టే ఈ ప్రక్రియను ఎన్నికల వేళ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ఆయుధంగా వాడుతున్నారని ఆరోపించారు. ఓటర్ల పట్ల అమానవీయంగా వ్యవహరించడం, ఎస్ఐఆర్ నేపథ్యంలో సంభవిస్తున్న మరణాలపై 6న(మంగళవారం) కోర్టులో పిటిషన్ వేస్తామన్నారు.

ఓ సాధారణ పౌరురాలిగా అవసరమైతే దీనిపై సుప్రీంకోర్టు తలుపు కూడా తడతానన్నారు. 'నేను కూడా అనుభవమున్న లాయర్‌నే'అంటూ వ్యాఖ్యానించారు. అయితే, ఈ పిటిషన్‌ను వ్యక్తిగతంగా వేస్తారా, రాష్ట్ర ప్రభుత్వం లేక టీఎంసీ పక్షానా అనే విషయం ఆమె స్పష్టంగా తెలపలేదు. వ్యాధి గ్రస్తులు, వృద్ధులు కూడా తాము అర్హులైన ఓటర్లమే అని నిరూపించుకోవాల్సి వస్తోందన్నారు. ఏమాత్రం కనికరం చూపకుండా ఎస్ఐఆర్ సిబ్బంది వారినీ క్యూలలో నిల్చోబెడుతున్నారని ఆరోపించారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై వివక్ష చూపుతున్నారని మమత చెప్పారు. బెంగాలీలో మాట్లాడటం ఈ దేశంలో నేరమైపోయిందంటూ ఆమె..'నన్ను చంపినా సరే, బెంగాలీలోనే మాట్లాడుతా'అని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ప్రజలు తాయిలాలు చూపే బీజేపీ.. గెలిచిన తర్వాత అణచివేతలకు పాల్పడుతుందని హెచ్చరించారు. 'ఎన్నికలకు ముందు తలా రూ.10 వేలు పంచిపెడుతుంది.. ఆ తర్వాత వారిపైకి బుల్‌డోజర్లను నడుపుతుంది'అంటూ బీజేపీపై ధ్వజమెత్తారు.

# పిఎఫ్ వేతన పరిమితి సవరణను పరిశీలించండి

***పిఎఫ్ వేతన పరిమితి సవరణను పరిశీలించండి***

దకొండేళ్లుగా సవరించని ఉద్యోగుల భవిష్య నిధి పథకం(ఈపీఎఫ్‌వో) వేతన పరిమితిని సవరించే అంశంపై 4నెలల్లోగా ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. ఈపీఎఫ్‌వో ప్రస్తుతం నెలకు రూ.15వేలకన్నా ఎక్కువ జీతం ఉన్న వారిని కవరేజ్ నుంచి మినహాయించిందని పేర్కొంటూ నవీన్ ప్రకాష్‌నౌతియాల్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కనీస వేతనం.. నెలకు రూ.15వేలుగా ఉన్న ఈపీఎఫ్‌వో పరిమితి కన్నా ఎక్కువగా ఉందని పిటిషనర్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అత్యాధునిక తీరగస్తీ నౌక 'ఐసీజీ సముద్ర ప్రతాప్'ను జలప్రవేశం చేసిన రాజ్‌నాథ్ సింగ్




భారత సముద్రతీర ప్రాంతాల్లో సాగరజలాలలను కాలుష్యం బారి నుంచి కాపాడే అత్యాధునిక తీరగస్తీదళ నౌక ఐసీజీ సముద్ర ప్రతాప్‌ను భారత్ విజయవంతంగా రంగంలోకి దింపింది. సోమవారం గోవాలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్వయంగా నౌక ను జలప్రవేశంచేయించారు. భారత ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)తోపాటు ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్(ఈఈజెడ్)లకు రక్షణగా నిలబడుతూనే సముద్రప్రాంతంలో కాలుష్య నియంత్రణ, సముద్రజలాల్లో చట్టాల అమ లు, విపత్కర పరిస్థితుల్లో బాధితుల కోసం అన్వేషణ, సహాయ కార్యక్రమాల్లో ఐసీజీ సముద్ర ప్రతాప్ పాలుపంచుకోనుంది.

భారత్‌లో నిర్మాణం పూర్తిచేసుకున్న అతిపెద్ద కాలుష్య నియంత్ర నివారణ నౌకగా ఇది రికార్డ్ సృష్టించింది. దేశ నౌకనిర్మాణ రంగ కౌశలతకు కొత్త నౌక దిక్సూచీగా నిలుస్తుందని రాజ్‌నాథ్ అన్నారు. భవిష్యత్‌లో భారత నౌకారంగం, దీర్ఘకాలిక, స్వచ్ఛమైన, సురక్షితమైన, భద్రమైన వృద్ధి పథంలో దూసుకుపోయేందుకు ఈ నౌక చుక్కానిలా నిలిచిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.


గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ తయారుచేసిన ఈ నౌకను గత నెలలోనే తీరగస్తీ దళానికి అందజేశారు. దక్షిణ గోవాలోని వాస్కోలో ఉన్న గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ పరిధిలోని సముద్రజలాల్లో సోమవారం ఈ నౌకను అధికారికంగా రాజ్‌నాథ్ జలప్రవేశం చేయించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ పరమేశ్ శివమణి సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత అద్భుతమైన నావికా దార్శనికతతో ఈ కార్యక్రమం అనుసంధానమైందని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

# దుబాయ్ ప్రయాణికులకు గుడ్ న్యూస్..

దుబాయ్ వెళ్లే ప్రయాణికులకు గుడ్ న్యూస్. ఇకపై విమానాశ్రయాల్లో ధృవపత్రాల పరిశీలన మరింత సులభం కానుంది. ప్రయాణికులు విమానాశ్రయంలో తమ పాస్‌పోర్ట్‌లు, ఇతర పత్రాలను చూపించకుండానే వెళ్లేందుకు అవకాశం కల్పించనున్నారు అధికారులు. దీని కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. వలస విధానాలను పూర్తి చేసుకునేందుకు వీలు కల్పించే బయోమెట్రిక్ (రెడ్ కార్పెట్) వ్యవస్థను ఈ నెలాఖరు నాటికి అన్ని విమానాశ్రయాల్లో విస్తరించనున్నారు. దుబాయ్ చేరుకునే టెర్మినల్3 ప్రయాణీకులకు ఇది అందుబాటులో ఉంటుంది. దుబాయ్ విమానాశ్రయాన్ని ప్రపంచంలోనే అత్యంత అధునాతన కేంద్రంగా మార్చడంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నారు.

బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్..

ఎమిరేట్స్ యాప్, విమానాశ్రయ కియోస్క్‌ల ద్వారా బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన వారికి ఈ సేవ అందుబాటులో ఉంటుంది. మీరు మొదటిసారి స్మార్ట్ గేట్‌ను ఉపయోగిస్తుంటే.. ఏఐ కెమెరాలు మీ బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరించి భవిష్యత్‌లోనూ వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. ఇందులో నమోదు చేసుకోవడానికి మీకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, ఎమిరేట్స్ ఐడీ ఉండాలి. అలా నమోదు చేసుకున్న తర్వాత, మీరు మీ పాస్‌పోర్ట్, బోర్డింగ్ పాస్‌ను చూపించకుండానే స్మార్ట్ కారిడార్ గుండా వెళ్లొచ్చు.




# పాటతో పాటు రిలీజ్ డేట్ ప్రకటించారు

'ఏజెంట్' మూవీ ఫ్లాప్ దెబ్బకు పూర్తిగా సైలెంట్ అయిపోయిన అఖిల్.. చాలా సైలెంట్‌గా 'లెనిన్' షూటింగ్ చేస్తూ వచ్చాడు. తొలుత హీరోయిన్‌గా శ్రీలీల అనుకున్నారు. ఆ మేరకు గ్లింప్స్ రిలీజ్ చేశారు. తర్వాత ఈమె ప్లేసులోకి భాగ్యశ్రీ వచ్చింది. ఈ మధ్య వదిలిన పోస్టర్‌తో ఈ క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు సినిమా నుంచి తొలి గీతాన్ని వదిలారు. అలానే మూవీ రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. తమన్ సంగీతమందించిన 'వారెవ్వా' అంటూ సాగిన ఈ మెలోడీ సాంగ్ వినడానికి బాగుంది. అఖిల్‌భాగ్యశ్రీ కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అయ్యేలానే కనిపిస్తుంది. నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్, నాగవంశీ సితార ఎంటర్ టైన్‌మెంట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకుడు. రాయలసీయ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీశారు. మే 01న 'లెనిన్' థియేటర్లలోకి రానుంది.

ఇప్పటివరకు అఖిల్ ఐదు సినిమాలు చేస్తే.. వాటిలో 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' ఓకే అనిపించుకుంది. మిగిలినవన్నీ బోల్తా కొట్టాయి. దీంతో ఈసారి ఎలాగైనా అఖిల్ హిట్ కొట్టాలి. మరి 'లెనిన్'తో ఏం చేస్తాడో చూడాలి?



# ఛాన్సులు పోయినా సరే వెనక్కు తగ్గని జీవితం

బాలీవుడ్‌లో అగ్ర కథానాయికల్లో ఒకరైన దీపికా పదుకోన్ నేడు 39వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఇండియాలోనే పాపులర్ హీరోయిన్‌గా ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యధిక రెమ్యునరేషన్ (రూ. 20 నుంచి 30 కోట్లు) ఒక్కో సినిమాకు అందుకునే నటిగా కొనసాగుతున్నారు. అయితే, నటిగా కెరీర్ మొదలుపెట్టిన పదిహేడేళ్లకు 'కల్కి 2898 ఏడీ' మూవీతో దీపికా పదుకోన్ తెలుగు తెరపై కనిపించారు. హీరో ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ మూవీలోని సుమతి పాత్రలో అద్భుతంగా నటించారు. అయితే, సీక్వెల్‌లో ఆమె నటించలేదు.

**ఛాన్స్‌లు పోయినా సరే ఎక్కడా తగ్గని దీపిక**

పని గంటలు విషయంలో ఆమె షరతులు పెట్టారని అందుకే కల్కి 2 నుంచి మేకర్స్ తొలగించారనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ప్రభాస్ కొత్త సినిమా స్పిరిట్ నుంచి కూడా చర్చల దశలోనే ఆమెను తప్పించారని టాక్. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఆమెపై తీవ్రమైన ట్రోలింగ్‌కు దిగారు. కానీ, తను మాత్రం ఎక్కడా కూడా తిరిగి వారికి కౌంటర్ ఇవ్వలేదు. ఒక వ్యక్తి 8 గంటల కంటే ఎక్కువగా పనిచేయడం కష్టమని ఆమె పదేపదే అన్నారు. అదే మాటపై కట్టుబడుతానని బహిరంగంగా చెప్పారు. అలా ఒప్పుకున్న వారితోనే కలిసి సినిమా చేస్తానని చెప్పుకొచ్చారు. కొద్దిరోజుల తర్వాత తను చేసిన వ్యాఖ్యలను చాలామంది మేకర్స్ సమర్థించారు కూడా.. ఈ క్రమంలో తనకు కొన్ని సినిమా ఛాన్సులు కూడా పోయాయి. అయినప్పటికీ తను ఎంతమాత్రం తగ్గలేదు. అయితే, అల్లు అర్జున్ అట్లీ కాంబినేషన్ సినిమాలో దీపికా నటిస్తున్నడం విశేషం. నేడు ఆమె బర్త్‌డే సందర్భంగా ఆ చిత్ర నిర్మాణ సంస్థ ఒక పోస్టర్‌ను కూడా విడుదల చేసింది.



బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌లలో ఒకరిగా దూసుకెళుతున్నారు దీపికా పదుకోన్. 'ఐశ్వర్య' (2006) అనే కన్నడ సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన ఈ బ్యూటీ రెండు దశాబ్దాల కెరీర్‌కి చేరువ అవుతున్నారు. కన్నడ, హిందీ, తమిళ, తెలుగు, ఇంగ్లిష్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించారామె. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్‌తో ఏడడుగులు వేశారు. 2018 నవంబరు 14న వీరి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత కూడా దీపిక క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లను సొంతం చేసుకుని, ఔరా అని ఆశ్చర్యపరిచారామె.

# టాలీవుడ్‌లో ఒకేరోజు ఈవెంట్ల జాతర

పండగ సీజన్‌కి టాలీవుడ్‌లో సినిమాల వరద కురుస్తోంది. ఒకేసారి అయిదు సినిమాలు రిలీజ్‌కి సిద్ధమవుతుండగా, వాటి ప్రమోషన్లలోనూ పోటీ వాతావరణం నెలకొంది. జనవరి 7న ప్రత్యేక హంగామా జరగనుంది. అదే రోజు రెండు ట్రయిలర్లు, రెండు ప్రీరిలీజ్ ఈవెంట్లు ప్లాన్ చేశారు. ఇప్పటికే రాజాసాబ్, శంకర ప్రసాద్ ట్రయిలర్లు విడుదలయ్యాయి. ఇక నవీన్ పోలిశెట్టి రాజుగారు, రవితేజ భక్త మహాశయులు ట్రయిలర్లు జనవరి 7న విడుదల కానున్నాయి. సాయంత్రం 4 గంటలకు ఒక ట్రయిలర్, సాయంత్రం 6 గంటలకు మరో చిత్రం ట్రయిలర్ రానున్నాయి. అదే రోజు మెగా స్టార్ శంకర ప్రసాద్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరగనుంది. ప్రభాస్ పాన్ ఇండియా సినిమా 'రాజాసాబ్' కోసం ప్రత్యేక ఈవెంట్ సెట్‌లో ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in